క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో వస్తున్న గ్రామస్తులు

గరిడేపల్లి : మండల పరిధిలోని మంగాపురంలో ఆదివారం బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపు వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధరావత్ అంజయ్య, బత్తిని అంజయ్య, కారింగుల కృష్ణమూర్తి, ఉల్లెందుల రాములు, బత్తిని నరసింహారావు, ఎలమంచయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెంది కన్నెబోయిన వెంకటేశ్వర్లు రూ.10వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భౌరిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకన్న, వందనపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

గరిడేపల్లి : మండల పరిధిలోని పానుగోడు గ్రామంలో ఆదివారం అంబేద్కర్ యూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో యూత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిపాటి నరేష్, ఉపాధ్యక్షుడిగా చిటికెల కిరణ్, కోశాధికారిగా లంకపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి ఒగ్గు మహేష్, సభ్యులుగా ఇరుగు అనిల్, కుదురు మహేష్, చిలక మధు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు అంబేద్కర్ యూత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నందిపాటి మలయ్య, నందిపాటి సామ్రాట్, కళ్యాణ్, కుర్రి వెంకన్న, అప్పికట్ల అశోక్, గోపి, చిలక పిచ్చయ్య, చిలక జానయ్య, వెంకటయ్య, జానకిరాములు, ప్రభు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండముచ్చుకు అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న జీపీ సిబ్బంది

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారంలో గల ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో శనివారం రాత్రి కొండముచ్చు మృతి చెందింది. కాగా గ్రామపంచాయతీ సిబ్బంది ఆదివారం కొండముచ్చును శ్మశానవాటికకు తీసుకెళ్లి ఖననం చేశారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీవారి సేవకులు

గరిడేపల్లి : మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కుర్ర సామిక గత నెల గోపాలపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో ప్రాణాప్రాయ స్థితిలో ఉంది. ఆదివారం శ్రీవారి సేవకులు సామిక వైద్యఖర్చులకు నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.16 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శివాలయ పురోహితులు కొంపెల్లి కృష్ణశాస్త్రి, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

నేరేడుచర్ల : విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బాబురావుకు చెందిన ఆవు మేతకు వెళ్లి స్థానిక కూడలిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

డబుల్ రోడ్డు నిర్మాణానికి మోక్షం

- మొద్దులచెరువు -మోతె లింక్‌రోడ్డుకు రూ.25కోట్లు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభించనున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రెండు మండలాల ప్రజలు



మొద్దులచెరువు నుంచి మోతె వెళ్లే రోడ్డు

మునగాల : రెండు జాతీయ రహదారులను కలిపే మొద్దులచెరువు-మోతె లింక్‌రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని మోతె, మునగాల మండల ప్రజల చిరకాలవాంఛ త్వరలో నెరవేరనుంది. రాష్ట్ర ప్రభుత్వం డబుల్‌రోడ్డుగా నిర్మించేందుకు రూ.25కోట్లు మంజూరు చేసింది. హైదరాబాద్-విజయవాడలను కలిపే ఎన్‌హెచ్-65, సూర్యాపేట-ఖమ్మం మధ్య నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్-365 రహదారులు కలిసే విధంగా మునగాల మండలంలోని మొద్దులచెరువు నుంచి మోతె మండల కేంద్రం వరకు గల 12.8కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంటుంది. ఇప్పటికే ఈ రహదారి సింగిల్‌గా ఉండడంతో పాటు ఇరుపక్కల ఆక్రమణలకు గురైంది. ఈ సింగిల్‌రోడ్డుకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ కొన్నేళ్లుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చాలని రెండు మండలాల ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎట్టకేలకు వారి కోరిక నెరవేరింది. ఈ రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చాలని ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదిక ఆధారంగా నిర్మాణ పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి, సహకారంతో డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఈ రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చితే రెండు మండలాలకు చెందిన సుమారు పది గ్రామాల ప్రజలు ఇటు హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం పట్టణాలకు వెళ్లేందుకు మార్గం సుగమంకానుంది. ప్రస్తుతం రెండు మండలాలు కోదాడ నియోజకవర్గ పరిధిలో ఉండడం, కోదాడ ఎమ్మెల్యే అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో డబుల్ రోడ్డుగా మార్చేందుకు అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించి నిధులు మంజూరు చేయించినట్లు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు తెలిపారు.

మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతికి కృతజ్ఞతలు



కొన్నేళ్లుగా మొద్దులచెరువు-మోతె రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చాలని ఈ ప్రాంత ప్రజల కోరిక ఎట్టకేలకు ఫలించింది. గత ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం దక్కలేదు. ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన పద్మావతి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరయ్యాయి. వారికి ఈ ప్రాంతవాసులు ఎంతో రుణపడి ఉంటారు.

– సొంపంగు మోహన్, ఎంపీటీసీ, రేపాల

త్వరలో రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ



మొద్దుల చెరువు నుంచి మోతె మండల కేంద్రం వరకు గల 12.8కి.మీ ఆర్‌అండ్‌బీ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేశాం. దీంతో ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసింది. పది, పదిహేను రోజుల్లో టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభిస్తాం. సంవత్సరంన్నరలోగా పూర్తిస్థాయిలో రోడ్డు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తాం.

– బి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, మునగాల

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

హుజూర్‌నగర్ : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు పులిచింతల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ సెల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటినీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కొక్కటీ అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా గానే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించారని పేర్కొన్నారు. రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు ఎం.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ నర్సిరెడ్డి, కోటయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, కన్నయ్య, అరవింద్‌రెడ్డి, ఎం.బసవయ్య, ఎస్.రావిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుపై రక్షణ గోడ ఏర్పాటు చేయాలి



కల్వర్ట్‌ను పరిశీలిస్తున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డు నర్సయ్యగూడెం సమీపంలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుపై రక్షణ గోడ ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం రక్షణ గోడ లేని కల్వర్టును ఆయన పరిశీలించి మాట్లాడారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై నేరేడుచర్ల, పాలకవీడు మండలాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు, జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లే భక్తులు ప్రయాణిస్తుంటారని, ఈ కల్వర్టు వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కల్వర్టు వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు వెంటనే రక్షణ గోడను నిర్మించాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకారాజు శ్రీను, వెంకట్, లక్ష్మియ్య తదితరులున్నారు.

మేకల అభినవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అభినవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, క్రీడాకారులు

కోదాడరూరల్ : నేటి క్రీడాకారులు మేకల అభినవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని టీపీసీసీ సభ్యుడు చింతకుట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం చెస్ క్రీడాకారుడు మేకల అభినవ్ జయంతి సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెస్ క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అభినవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం భారత క్రీడారంగానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో అభినవ్ తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు, అరుణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ కందుల కోటేశ్వరరావు, వంగవీటి రామారావు, పారసీతయ్య, చందర్‌రావు, గంధం యాదగిరి, బొలిశెట్టి కృష్ణయ్య, ముత్తినేని సైదేశ్వరరావు, సామినేని రమేష్, బషీర్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



చిలుకూరు : గంగమ్మ జాతరలో పాల్గొన్న యువకులు

చిలుకూరు : మండల కేంద్రంలో గంగమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలతో వచ్చి గంగమ్మతల్లికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల పరిధిలోని సర్వారం గ్రామంలో ఆదివారం గంగమ్మతల్లి జాతర యాదవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతర ప్రతి ఏటా పంటలు బాగా పండాలని, వర్షాలు సంవృద్ధిగా కురవాలని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో యాదవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర ప్రారంభం



నడిగూడెంలో గంగమ్మ జాతరలో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

నడిగూడెం : మండల కేంద్రంలో యాదవుల కుల దైవం గంగమ్మ జాతరను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సాయి మందిరంలో గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై హర్షం

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీపై మంత్రిమండలి ఆమోదం తెలపడంపై కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం విడతల వారీగా చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని ఆయన అన్నారు. కోదాడ పీఏసీఎస్ పరిధిలోని 2381మంది అర్హులైన రైతులకు రూ.11కోట్ల మేర రుణమాఫీ కానుందని తెలిపారు.

విదుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మోటారుకు విద్యుత్ సరఫరా కావడంలేదని అదే గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ పోలోజు శివరామయ్యచారిని తీసుకెళ్లాడు. ఎలక్ట్రీషియన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజు వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై బండరాయిపై పడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్రంగా, కాళ్లకు, చేతులకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108వాహనానికి సమాచారం అందించి హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు.

కుటుంబానికి పరామర్శ

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎలుక సైదులుగౌడ్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం అతడి కుటుంబాన్ని టీఎస్‌టీయూసీ నాయకుడు శీతల రోషపతి పరామర్శించారు. అనంతరం సైదులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కె.వెంకటేశ్వర్లు, టి.రాములు, జి.వెంకన్న, బి.రాజా తదితరులు ఉన్నారు.

నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలి

గరిడేపల్లి : మండలంలోని వ్యవసాయ బావుల వద్ద ఇటీవల మోటార్లను అపహరిస్తున్న నిందితులను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల పలువురు కోరారు. మండల పరిధిలోని వెలిదండ రోడ్డులో రంగాపురం రైతు వేదిక పక్కన గల ఆరుబావుల మోటార్లను ఈనెల 19న రాత్రి చోరీకి గురయ్యాయని రైతు రాతికింది కిరణ్ తెలిపారు. అదే విధంగా కొత్తగూడెం, తాళ్లమల్కాపురం, కీతవారిగూడెం గ్రామాలకు చెందిన సుమారు 20పైగా విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడడంతో రైతులు లబోదిబోమంటున్నారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పోలీసులు వెంటనే గుర్తించి దొంగలను పట్టుకొని మోటార్లను స్వాధీనం చేసుకోవాలని రైతులు కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు

అర్వపల్లి : రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాజిరెడ్డిగూడెం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలోని 32 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గ్రామాల వారీగా ఈ నెలాఖరు వరకు నోట్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే పదోతరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

గరిడేపల్లి : మండల పరిధిలోని కాల్వపల్లి గ్రామంలో గల శ్రీ శీతల పరమేశ్వరి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ విఘ్నేశ్వరపూజ, స్వామి వారికి పంచామృత అభిషేకం, 1008 జలబిందెలతో బొడ్రాయికి ఘటాభిషేకం, విశేష అర్చన అలంకరణ నిర్వహించారు. వేడుకలో భాగంగా మహిళలు బిందెలతో వచ్చి బొడ్రాయికి నీళ్లు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి నీరాజనం మంత్రపుష్పము తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, పురోహితులు ద్రోణ సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, రాయప్రోలు శ్రీరామయ్య శర్మ, దేవ మంగళశర్మ, దివాకర్‌శర్మ, యోగేంద్ర చార్యులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి



హుజూర్‌నగర్ : చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తుస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి, నాయకులు కంటు నాగరాజు, కొల్లోజు నాగేంద్రచారి, బత్తుల ఉపేందర్, విజయ్, కోటయ్య చారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు లతీఫ్, శోభారాణి, మేకల నాగరాజు, వీరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తీర్మానం



సమావేశంలో పాల్గొన్న గౌడ సంఘం సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామంలో గౌడ సంఘం సమావేశాన్ని ఆదివారం కులపెద్ద గౌడ్ బత్తిని ధర్మయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీకంఠమహేశ్వరస్వామి సురమాంబ, వనం మైసమ్మ దేవతల ఆలయాలను నూతనంగా నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సుమారు 25మందితో ఆలయ నిర్మాణ కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఉపగౌడ్ అనంతు చిన్నరాములుగౌడ్, బత్తిని అంజయ్యగౌడ్, చంద్రయ్యగౌడ్, కరుణాకర్‌గౌడ్, సైదులుగౌడ్, గురుస్వామిగౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, అంజిగౌడ్, భిక్షంగౌడ్, మనోజ్ గౌడ్, రాంబాబుగౌడ్, పి.సైదులుగౌడ్, తిరుపయ్యగౌడ్, నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్, నాగయ్య గౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్ క్లబ్‌లు ముందంజ

భానుపురి : సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌లు ఎల్లప్పుడూ ముందంజలో ఉంటాయని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో స్ఫూర్తి క్లబ్, స్పందన క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. లయన్స్ కంటి ఆస్పత్రి ద్వారా వేలాది మంది పేదలకు కంటి చికిత్సలు, ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. అనంతరం స్ఫూర్తి క్లబ్ చైర్మన్‌గా వెన్న కవిత, స్పందన క్లబ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్‌తోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, తంగెళ్ల లక్ష్మీకాంతారెడ్డి, నాతి సవీందర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వితంతువులపై వివక్షను విడనాడాలి



ర్యాలీలో పాల్గొన్న సంస్థ సభ్యులు

మద్దిరాల : వితంతువులపై వివక్షను విడనాడాలని సీఎస్‌పి సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్లు రమ, శిరీష అన్నారు. ఆదివారం అంతర్జాతీయ వితంతు మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమాజంలో భర్త చనిపోయిన స్త్రీలు పసుపు, కుంకుమ బొట్టు, గాజులు ధరించకూడదనే మూఢనమ్మకాన్ని విడనాడాలని అన్నారు. భర్తతో వచ్చేది పుస్తె, మెట్టెలు మాత్రమే కాని బొట్టు, గాజులు కావని తెలిపారు. వితంతువులకు చేతనైతే సహాయం చేయాలి తప్ప.. శుభకార్యాలకు పనికిరారు అనే వివక్షను చూపొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పి సాంఘిక సేవా సంస్థ సభ్యులు నాగెల్లి నిర్మల, ఎడ్ల ఉమ, మరియమ్మ, నిరోష, పూలమ్మ పాల్గొన్నారు.

వెంకటనర్సయ్య స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, రైతు కూలీ సంఘం వ్యవస్థాపక సభ్యుడు అలుగుబెల్లి వెంకట నర్సయ్య స్మారక స్థూప నిర్మాణానికి ఆదివారం మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య మాట్లాడారు. పేదల కోసం, దోపిడీ లేని సమాజం కోసం పోరాడిన నాయకుల స్థూపాల నిర్మాణం అంటే నేటి పాలకుల ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఉద్యమాల వైపు తీసుకువెళ్లడమే అన్నారు. సంఘం బలోపేతానికి, రైతు కూలీల హక్కుల కోసం వెంకట నర్సయ్య ఉద్యమాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నలగొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సక్క, పార్టీ గ్రామ నాయకులు ప్రతాప్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యల్లన్న ఆశయ సాధనకు కృషిచేయాలి



యల్లన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : ప్రజాయుద్ధ కిరణం యల్లన్న ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నియోజకవర్గ కన్వీనర్ వాస పల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యల్లన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్న తనం నుంచి యల్లన్న ఎర్రజెండా పట్టి పేద ప్రజల కోసం సుదీర్ఘ పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, కరుణాకర్, లక్ష్మి, నాగమణి, శ్యామల, పావని, దేవయ్య, జానీబేగం, ఫాతిమా, కిష్టమ్మ, జ్యోతి తదితరులున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

పాలకవీడు : మండలంలోని వివిధ గ్రామాల్లో అక్కడక్కడా విద్యుత్ స్తంభాలకు, వైర్లకు తీగజాతి మొక్కలు అల్లుకుని ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పిచ్చిమొక్కలు విద్యుత్ తీగలకు అల్లుకోవడంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈదురుగాలులు వీచినా, వర్షం కురిసే సమయాల్లో ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ముఖ్యంగా రోడ్ల వెంట, కాలనీల పరిసరాల్లో ఆదమరిచి వెళ్లినా, పశువులు మేత కోసం వెళ్లినా ప్రమాదం తప్పదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్తంభాల చుట్టూ ఉండే పిచ్చిమొక్కల పొదళ్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కల్మేట్‌తండా వద్ద విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగజాతి మొక్కలు